
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 175 -
## అసలు నాకే ఎందుకు ఇలా?

మా ఊళ్ళో..ఆ మాటకొస్తే అమెరికాలో ఇంచుమించు అన్ని నగరాలలోనూ "కాసుకో" అనే పెద్ద సూపర్ మార్కెట్ ఉంది. అది ఎంత సూపర్ అంటే మనం ఒక సబ్బు బిళ్ళ కొనుక్కుందాం అని అక్కడికి వెళ్తే 'అలా కుదరదు అబ్బాయ్. కనీసం పది కొనుక్కోవాలి" అని అన్ని వస్తువులూ అలాగే భారీ సైజులో అమ్ముతారు. అంతకన్నా పెద్ద సమస్య ఆ కొట్టు వైశాల్యం కన్యాకుమారి నించి కాశ్మీర్ దాకా ఉంటుంది. మనం రోజు వారీ వ్యాయామానికి ఏదో ఏడాదికి సరిపడా సబ్బు బిళ్ళలొ, నెలకి సరిపడా పెప్పర్ మెంట్ బిళ్లలో, మంచి నీళ్లో మరొహటో కొనుక్కోడానికి రోజూ అక్కడికి వెళ్ళొస్తే చాలు. ఇదంతా బానే ఉంది కానీ....కావలసినవి కొనుక్కుని వాళ్ల చక్రాల బండిలో పడేసి. అప్పటికే మైళ్ల కొద్దీ నడిచిన ఆయాసంతో దాన్ని తోసుకుంటూ డబ్బులు కట్టే కౌంటర్ దగ్గరకి వెళ్తానా? దాం దుంప తెగా...ఎప్పుడూ నేనే ఆఖరి వాడిని. నా ముందు వంద మంది ఉంటారు. ఎప్పుడు వెళ్ళినా, ఒకే ఒక్క వస్తువు కొని "పది తక్కువ ఉన్న కౌంటర్" కి వెళ్తే అక్కడా మనమే ఎక్కడో వెనకాల. ఈ మధ్యనే వచ్చిన "స్వీయ కొనుగోలు"...అంటే 'సెల్ఫ్ చెకింగ్" లలొ కూడా నేను అక్కడికి వెళ్ళబోతున్నట్టు వంద మందికి ముందే ఎలా తెలుస్తుందో మరి...అక్కడా మనమే ఆఖరి చెకింగ్!. అసలు నాకే ఎందుకు ఇలా అవుతుంది?

ఈ మధ్య విమాన ప్రయాణాలు తగ్గిపోయాయి. కానీ నా జాతకం మటుకు అలాగే ఉంది. కోవిడ్ ముందు ఎప్పుడు ఏ దేశం వెళ్ళినా, అమెరికాలోనే మరొక నగరం వెళ్ళినా విమానాశ్రయానికి వెళ్ళి, పెట్టెలు చెక్ ఇన్ చేసి, ఒక చిన్న చక్రాల పెట్టె, అందులో ల్యాపుటాపు పెట్టుకుని విమానం ఎక్కే గుమ్మం...అదే గేట్ కి వెళ్దాం అని ఆ పెట్టె లాక్కుంటూ అపసోప్లాలు పడుతూ వెదుతుంటే ఆ వెధవ గేట్ ఎంతకీ రాదే1. నేను ఎక్క వలసిన "గుమ్మం" విమానాశ్రయం లోపలే రెండు మైళ్ళ నడిచాక ఎప్పుడూ ఆఖరిదే!. అలా అని తిరిగి వచ్చేటప్పుడు అది మొదటి గేట్ అవుతుందా అంటే అప్పుడు దిగే గుమ్మం కూడా చిట్టచివరిదే. క్రిందటి వారం రెండేళ్ళ తర్వాత విమానం ఎక్కినా పరిస్థితి అదే. ఇలా విమానాలు ఎక్కే గుమ్మం, గిగే గుమ్మం కూడా ఎప్పుడూ ఆఖరివే అవడం నాకే ఎందుకు ఇలా?

ఈ మధ్య కోవిడ్ ధర్మమా అని అన్ని సమా'వేషాలూ' అంతర్జాలం లోనే. కాణీ ఖర్చు లేకుండా, పట్టు పంచ లాల్చీయో, సూటూ బూటూ యో, మోడీ కోటూ లాటిదో వేసుకోకుండా హాయిగా ఇంట్లోనే లుంగీ కట్టుకుని కూచుని " సప్త ఖండాల అవధానం లో కానీ, యాభై దేశాల తిష్టాత్మక అంతర్జాతీయ సాహితీ సదస్సులో కానీ..ఆఖరికి ఎవరికో ఎవరో ఇచ్చే జీవన దౌర్భాగ్య పురస్కార మహాసభలో కానీ నేను పాల్గొనే అవకాశాలు చాలానే వస్తున్నాయి. కానీ ఇక్కడ ఒకటే చిక్కు. ఇలాంటి సభలలో నాలాగ "ప్రధాన అతిథులు". "ప్రత్యేక అతిథులు", "విశిష్ట అతిథులు" కేటగిరీలలో దేశ దేశాల నుంచి పది పదిహేను మంది ఉంటారు కానీ ఆ మాట ఆ సభలని "నిర్వాకం" చేసే వాళ్ళు మనకి ముందు చెప్పరు. కేవలం నన్నొక్కడినే స్పెషల్ గా పిలుస్తున్నట్టు బిల్డ్ అప్ ఇవ్వడంతో ఇదేదో బాగానే ఉందే అని సభ అమెరికా సమయం అర్ధరాత్రి అయినా పరవా లేదులో అని ఒప్పేసుకుంటాను. సరిగ్గా ముందు రోజే వాళ్ళు పంపించిన ఫ్లయర్ చూస్తే అప్పుడు తెలుస్తుంది నా లాంటి "స్పెషల్ అతిథులు" మరో పది మంది ఉన్నారు అని. నేనే కదా స్పెషల్ కాబట్టి నా చిలక పలుకులు మొదట్లోనే ఉంటాయి కాబట్టి మహా అయితే రాత్రి ఒంటి గంటలోగా మాట్లాడేసి పడుకోవచ్చును అనుకుంటే ..అబ్బే...మనదే ఆఖరి ప్రసంగం...రాత్రి రెండున్నర....అప్పటికే అందరూ అన్నీ మాట్లాడేయడంతో "డిటో" అనడం తప్ప ఇక నా ప్రవచనానికీ, ఉవాచ కీ ఏమీ మిగలదు. తీరా అప్పుడు పక్క మీద వాలగానే "అయిందా వెధవ సోది?" అని మా క్వీన్ విక్టోరియా టెంకి జెల్ల!.అసలు ఇలా నాకే ఎందుకు ఇలా?

ఇక ఈ మధ్య ఈ 'అమెరికోడ్' బాధలు మరీ ఎక్కువ అయిపోయాయి. నిన్న నా ల్యాపుటాపు లో మా బ్యాంకు ఖాతా కి వెళ్ళి, కరెంటు బిల్లు లాంటివి కట్టాను. తర్వాత అమెజాన్ వెబ్ సైట్ కి వెళ్ళి నాలుగు చెడ్డీలు కొనుక్కోగానే మళ్ళీ ఇందాకా మర్చిపోయిన వాటర్ బిల్లు కట్టడానికి ఆ బ్యాంకు వెబ్ సైట్ కి వెళ్ళగానే శ్రీముఖం "నీ కంప్యూటర్ ని మేము గుర్తుపట్ట లేదు. అది గుర్తుపట్టాలంటే ఇక్కడ నొక్కండి" అనగానే ప్రేమగా నొక్కాను. వెంటనే "మీకు కోడ్ ఎక్కడికి పంపించాలి? మీ సెల్ ఫోన్ మెసేజ్ లాగనా లేక ఇమైల్ కా? అని అడిగింది. ఫోన్ అని ఇంకా నొక్కితూ ఉండగానే టింగురంగా అని ఫోన్ లో ఆ కోడ్ రావడం, అది పెట్టడం...ఇంత వరకూ బాగానే ఉంది. ఈ లోగా అమెజాన్ వాడి దగ్గర నుంచి "ఇందాకా నువ్వు కొన్న చెడ్డీలు యుక్రెయిన్ యుద్ధం వలన సప్లై చైన్ సమస్యలతో చైనా నుంచి రావడానికి 12 వారాలు పడుతుంది." అని మళ్ళీ అదే ఫోన్ లో సమాచారం రాగానే "దాం దుంపదెగా. అక్కడెక్కడో యుద్ధం అవుతుంటే అమెరికాలో చెడ్డీలకి సమస్య ఏమిటీ" అని కోపం వచ్చి ఆ ఆర్డర్ కేన్సిల్ చేసేద్దాం అని అమెజాన్ వెబ్ సైట్ కి మళ్ళీ వెళ్ళగానే "నీ కంప్యూటర్ ని మేము గుర్తుపట్ట లేదు. అది గుర్తుపట్టాలంటే ఇక్కడ నొక్కండి" – మళ్ళీ నొక్కుట, కోడ్ వచ్చుట, చెడ్డీ కొనుగోలు కేన్సిల్ చేయుట జరిగాయి. దాని తాలూకు డబ్బు చార్జీలు వెనక్కి వచ్చాయో లేదో అని ఆ క్రెడిట్ కార్డ్ వెబ్ సైట్ తెరవగానే ఆ వెధవా అదే కూత """నీ కంప్యూటర్ ని మేము గుర్తుపట్ట లేదు. అది గుర్తుపట్టాలంటే ఇక్కడ నొక్కండి"..చెప్పొద్దూ ఇలా రోజుకి కనీసం పాతిక సార్లు ఈ "అమెరికోడ్" ల ఆట ఆడ లేక చస్తున్నాను. పోనీ అన్నీ ఒకే

లాగ ఉంటాయా అంటే అదీ లేదు. ఒక కోడ్ నాలుగు అంకెలు. మరొకటి పధ్నాలుగు. ఇంకోటి నాలుగు అంకెలు, మధ్యలో అక్షరాలు, మళ్ళీ అంకెలు. ఆ అక్షరాలలో కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి,,అంటే కేపిటల్ లేదా స్మాల్ కేస్...ఇక కొన్ని కోడ్ గాళ్ళు ఫోన్ లో కానీ చెప్పరు. చచ్చినట్టు ఆ సమయానికి పెన్నూ, పేపరూ అందుబాటులో లేక పోతే అంతే సంగతులు. నా ప్రాణాలకి మరొక కోడ్ అదేదో "కాప్చా" ట అందులో వాడే పెద్దా, చిన్న అక్షరాలూ, అంకెలు అనీ అక్కడ పెట్టి, కింద చిన్న పెట్టెలో అవన్నీ తిరిగి కొట్టమంటాడు. మనం కూడబలుక్కుని కొట్టే లోపుగా "నీ సమయం మించిపోయింది. కొత్త కాప్చా కావాలంటే...మళ్ళీ నొక్కుడు కార్యక్రమం మొదలు. వీటన్నింటినీ మించినది మరొ దగుల్బాజీ పద్ధతి ఫొటోలు. ఈ సారి వాడు కోడ్ బదులు అర డజను మక మసకగా ఉండే ఫొటోలు పెట్టి, వీటిల్లో దున్న పోతు ఉన్న ఫొటోలు గుర్తించూ అంటాడు. నాకు తెలియక అడుగుతానూ...నేను ఇండియా వదిలేసి అమెరికా వచ్చేసి యాభై ఏళ్లయింది కదా...అసలు దున్నపోతు ఎలా ఉంటుందో ఎక్కడ జ్ఞాపకం ఉంటుందీ? పైగా వాడు పెట్టింది అమెరికా దున్నపోతో, ఆస్ట్రేలియాదో తెలిసి చావదు. అమెరికాలో ఆవులు, గేదెలు, దున్నపోతులు, ఎద్దులు అన్నీ ఒక్క లాగానే ఉంటాయి. ఎవడైనా మా టెక్సస్ వచ్చి, వాటి ని చూసి ఏది ఏమిటో చెప్పగలరేమో నేను చాలెంజ్ చేస్తాను...అసలు ఇంతకీ ఈ కంప్యూటర్ తెరిచినప్పుడల్లా ఈ కోడ్ మీద కోడ్ కొట్ట లేక చస్తున్నాను. అసలు ఇలా నాకే ఎందుకు ఇలా?

ఇలాంటి "నాకే ఎందుకు ఇలా?" అనేవి ఎన్నో, ఎన్నెన్నో!. మరి మీకో?

**COMMENTS**